క్లుప్తంగా

ఇసుక తరలింపుపై గొడవ

దేవరుప్పుల: ఇటీవల వాగు పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పోలీసు శాఖ కట్టడి చేస్తున్న క్రమంలో అనుమతులపై విషయమై కొలిక్కిరాని తరుణంలో ఇసుక తరలిస్తున్న తీరుపై గొడవ జరిగిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి లకావత్‌తండాలో మంజూరైన అంగన్‌వాడీ పాఠశాల నిర్మాణ పనుల కోసం తహసీల్ అధికారుల ఆరు ట్రిప్పుల ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చారు. అయితే ఇసుక తరలించే ట్రాక్టర్ యజమాని దేవరుప్పుల జీపీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా వాగులో దిగి ఇసుక తరలించే క్రమంలో స్థానికులు ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనుమతి పత్రాలు చూపించే సరికి తహసీల్ అధికారులతో మాట్లాడిన పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను వదిలిపెట్టారు. ఈ విషయం తెలిసిన స్థానికుడైన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో ఇసుక అనుమతులపై స్పష్టత వచ్చేంత వరకూ ఇసుక తరలించొద్దని ఆ ట్రాక్టర్‌ను తీసుకెళ్లి గ్రామ పంచాయతీ వద్దకు తరలించారు. దీంతో ఎస్సై ఊర సృజన్‌కుమార్ చేరుకుని అనుమతి మేరకు ఇసుక తరలిస్తున్న క్రమంలో అడ్డుకోవడం సరికాదని నచ్చజెప్పే క్రమంలో గ్రామస్తులతో వాగ్వాదం చోటుచేసుకుంది.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కొడకండ్ల : ఒకే రోజు జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో బుధవారం రాత్రి బస చేయాలన్న కలెక్టర్ ఆదేశాలు కొడకండ్ల మండలంలో బేఖాతర్ అయ్యాయి. జిల్లాలోని వివిధ అధికారులకు రాత్రి బస చేయాలని ఆదేశించిన కలెక్టర్ కొడకండ్ల మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ చంద్రమోహన్‌కు కేటాయించగా ఆయన రాత్రి 9 గంటల వరకు కూడా హాస్టల్‌కు రాలేదు. జిల్లాలోని అన్ని చోట్ల కార్యక్రమం జరిగినప్పటికి కూడా కొడకండ్లలో మాత్రం కలెక్టర్ ఆదేశాలు కార్యరూపం దాల్చలేదు. హాస్టల్ వార్డెన్‌తో పాటు సిబ్బంది విద్యార్థులంతా కూడా ముందస్తు సమాచారంతో అలర్ట్‌గా ఉన్నప్పటికి కూడా తహసీల్దార్ మాత్రం రాలేదు.

అన్ని చెరువులకు గోదావరి జలాలు

బచ్చన్నపేట: గ్రామాల్లోని అన్ని చెరువులను గోదావరి జలాలతో నింపుతామని, రైతులు దిగులు చెందొద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల్లో బోర్లు, బావుల్లో నీరు తక్కువ ఉండటంతో వరి పంట ఎండిపోతున్నాయని, దీంతో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో మాట్లాడి ఆలేరుకు వెళ్లే నీటిని నాగిరెడ్డిపల్లి, గంగాపూర్, బచ్చన్నపేట, పోచన్నపేట చెరువుల మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. అలాగే తపాస్‌పల్లికి నీటి పంపింగ్ కూడా ప్రారంభమైంది కావున అన్ని చెరువులు, కుంటలను నింపుకోవాలని అన్నారు. జిల్లా సందీప్, నాయకులు ఉన్నారు.

'కొలిపాక వెంకటస్వామిని గెలిపించండి'

జనగామ రూరల్: తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూషనరీ పెన్షనర్ల, ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌సీపీఈయూ) అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వెంకటస్వామిని గెలిపించాలని కోరారు. ఏనుగుతల యాదగిరి, బి.రామ్మోహన్, దొడ్డిపాటి శేఖర్, బోయిని ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- హాస్టళ్ల రాత్రి బస కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా


కరుణాపురం ఎంజేపీలో విద్యార్థులను గణిత టేబుల్స్‌పై అడుగుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా


పాలకుర్తి టౌన్: ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్


జనగామ రూరల్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని కరుణాపురంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాల, కళాశాలను కలెక్టర్ బుధవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అంతకు ముందు గణిత టేబుల్స్ ఎంతమందికి వస్తాయని అడుగగా కొందరు విద్యార్థులు 14వ టేబుల్ వరకు చెప్పడంతో కలెక్టర్ అభినందించారు. ప్రిన్సిపాల్ రవికుమార్, ఏటీపీ ఆర్.శ్రీనివాస్, డీడబ్ల్యూ జవహర్‌లాల్, ఫ్యాకల్టీ స్లీవరాజు అధికారులు పాల్గొన్నారు. అనతంరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి రాత్రి నిద్ర చేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో..

పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపాన ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆర్డీఓ డీఎస్ వెంకన్న, బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూప సందర్శించారు. అనంతరం రాత్రి కళాశాలల్లో అధికారులు బస చేశారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

జనగామ రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మైనార్టీ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి రాత్రి బస చేశారు. తొలుత హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకుని వారికి పాఠాలు బోధించారు. అలాగే పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మండలంలోని పసరమడ్లలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని జనగామ ఆర్డీఓ గోపీరాం, శామీర్‌పేట టీజీఎంఆర్ఈఐఎస్ బాలుర పాఠశాలను జిల్లా మత్స్య శాఖ అధికారి రాణాప్రతాప్, పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని పౌరసరఫరాల అధికారి డీఎం హతీరాం, మండలంలోని యశ్వంతాపూర్‌లోని బీసీ సంక్షేమ వసతి గృహం- 2 (బాలుర) జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్ రెడ్డి సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేసి రాత్రి బస చేశారు.

విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లు, చెన్నూరు ఎస్టీ హాస్టల్‌ను అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో వార్డెన్, నైట్ వాచ్‌మన్ గైహాజరు కావడంతో వారిపై చర్య తీసుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్‌ను అదేశించారు. అలాగే తెలగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను డీఆర్డీఓ వసంత సందర్శించి బస చేశారు.


బచ్చన్నపేట: ఎస్సీ హాస్టల్‌లో నిద్రిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

బచ్చన్నపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా చదవాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి రాత్రి బస చేశారు. ముందుగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

చిత్తశుద్ధితో సంరక్షకులు వ్యవహరించాలి..

దేవరుప్పుల: తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ విద్యార్జన కోసం వచ్చిన విద్యార్థుల యోగక్షేమం విషయంలో హాస్టల్ సిబ్బంది చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో పరిసరాలతోపాటు వంటకాలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో భోజనం చేశారు.

బీసీ హాస్టల్ తనిఖీ..

నర్మెట: మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ప్రత్యేక అధికారి, మిషన్ భగీరథ ఈఈ వైద్యం శ్రీకాంత్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ తాను సైతం వసతిగృహంలో ఉంటూ విద్యాభ్యాసం చేశానని, తన అనుభవాలను వివరించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి నిద్ర చేశారు.

కస్తూర్బా, బీసీ వసతి గృహం సందర్శన..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంతో పాటు బీసీ వసతి గృహాన్ని మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్ సందర్శించారు. తొలుత కస్తూర్బా విద్యాలయాన్ని రాధాకిషన్ సందర్శించి వంట సరుకులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం రాత్రి బస చేశారు.

నిధులు విడుదల చేయాలి

తరిగొప్పుల: గ్రామపంచాయతీ నిర్వహణకు గత ఆగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపు, జీపీ నిధులను వెంటనే విడుదల చేయాలని జీపీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు భూక్య రాజేందర్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సహచర కార్యదర్శులతో కలిసి ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ మాలతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిర్వహణకు అవసరమైన నిధులను నేరుగా టీజీబీపీఏఎస్ఎస్ ఖాతాకు విడుదల చేయాలని కోరారు. జీపీ సాధారణ నిధులను ట్రెజరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లించే అవకాశం కల్పించాలన్నారు. ఫర్మ్ క్రెడిట్ ఇవ్వలేకపోతే మార్చి 1వ తేదీ నుంచి జీపీల నిర్వహణ చేయలేమని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో భూక్య లింగం, మహేందర్, భాగ్యలక్ష్మి, రవీందర్, మమత, మాధవి, రాజు,శ్రీకాంత్, హరిత పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధం

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని జామాయిల్ తోట దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్ గ్రామంలోని చేర్యాల-బచ్చన్నపేట రహదారి టోల్‌గేట్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన రైతు వంగ భాస్కర్‌రెడ్డి 20 ఎకరాల్లో జామాయిల్ తోటను సాగు చేశాడు. తోటలో ఆరు సంవత్సరాలుగా జామాయిల్ చెట్లు ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని తోట మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనలో రూ. 20 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

'ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'


మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీటీసీ క్లస్టర్ గ్రామాల ఇన్‌చార్జ్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ రాబోవు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు గ్రామాస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సత్యనారాయణ, కుమారస్వామి, రాఘవరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గౌడ జనహక్కుల పోరాట సమితి(మోకు దెబ్బ) క్యాలెండర్‌ను మండల కేంద్రంలో ఝాన్సీరెడ్డి ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ క్యాడర్ సమన్వయంతో పనిచేయాలని ఝాన్సీరెడ్డి కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

చిల్పూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజవరం పంచాయతీ పరిధిలోని కేజీబీవీ, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మొదట కేజీబీవీని సందర్శించి నిర్వహణ తీరు, సిబ్బంది హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. పాఠశాల మరమ్మతు పనులపై ఎస్ఓ ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. కాగా, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ భోజనం చేశారు. వంటలు మరింత రుచిగా వండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆతహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, డీటీ రామారావు, ఎంపీఓ మధుసూదన్ ఉన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి రాణాప్రతాప్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు గిరిజన సంక్షేమ వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వంటగది, స్టోర్‌రూం, బాత్రూంల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.


సిబ్బందితో మాట్లాడుతున్న పింకేశ్‌కుమార్

పౌష్టికాహారం అందించాలి..

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యాసంగి పంటలకు సాగు నీరందించాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయన్న

జఫర్‌గఢ్ : గోదావరి జలాలతో యాసంగి పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆది సాయన్న ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో పెండ్యాల సమ్మయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బోరు, బావుల్లో నీరు అడుగంటిపోతుండడం వల్ల యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. గోదావరి జలాల ద్వారా పంటలకు నీరందించి రైతులను ఆదుకోవాలన్నారు. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కాల్వల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఉప్పుగల్లు రిజర్వాయర్ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని ఆయన కోరారు. సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్, సంఘం నాయకులు చొప్పరి సోమయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్షుడిగా ఎండీ యాకూబ్‌పాషా, ఉపాధ్యక్షులుగా మంద బుచ్చయ్య, ఎండీ జాఫర్, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల సమ్మయ్య, సహాయ కార్యదర్శులు దూడయ్య, ఎర్రం యాదగిరి, కోశాధికారిగా గడ్డి పెద్దిరాజుతోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న సాయన్న

కెపాసిటర్ల ఏర్పాటు

జనగామ రూరల్: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు పెంబర్తి సెక్షన్ పరిధి నాలుగు గ్రామాల 11 కేవీ ఫీడర్లకు కొత్తగా 600 కేవీఆర్ కెపాసిటర్ బాక్స్‌లను బుధవారం ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీరింగ్ అధికారి లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు ఓల్టేజీ పెరగడంతో పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ఉంటుదని చెప్పారు. ఏడీఈ వేణుగోపాల్, ఏఈ కనకయ్య విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అమర్చిన కెపాసిటర్ వద్ద విద్యుత్ అధికారులు

మూతపడిన వాటర్ ప్లాంట్

- ప్రజలకు తప్పని వెతలు
- పట్టించుకోని జీపీ సిబ్బంది

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలోని జీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ మూతపడింది. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. అసలు ప్లాంట్ తెరుస్తారా మూసివేస్తారా అని జీపీ సిబ్బందిపై మండిపడుతున్నారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ లేకపోవడంతో ఇతర గ్రామాల నుంచి తాగునీరు తెచ్చుకునే వారు. దీన్ని గమనించిన మాజీ సర్పంచ్ (పదవిలో లేని సమయంలో) పుట్ట అంజనీ రవీందర్‌రెడ్డి వారి కుమారుడు రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం 2014 సెప్టెంబర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ షెడ్‌ను ఏర్పాటు చేయించారు. అనంతరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అప్పగించారు. కొంతకాలం ప్లాంట్ నడిచినప్పటికీ తరచూ రిపేర్లు రావడంతో అతను వదులుకున్నారు. అనంతరం జీపీ ఆధీనంలోకి ప్లాంట్‌ను తీసుకుని రిపేరు చేయించి ప్రజలకు మినరల్ వాటర్ అందించారు. కానీ ఇటీవల మళ్లీ రిపేరుకు రావడంతో ప్లాంట్‌ను మూసివేశారే తప్ప కార్యదర్శి, ప్రత్యేకాధికారి పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తప్పనిపరిస్థితుల్లో నీటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి వాటర్ ప్లాంట్ తెరిపించి తాగునీరు అందివ్వాలని ప్రజలు కోరుతున్నారు.


మూసి ఉన్న జీపీ వాటర్ ప్లాంట్

ప్రైవేట్‌లో కొనలేక పోతున్నాం..



జీపీ వాటర్ ప్లాంట్ తెరిచిన సమయంలో తక్కువ ధరకు నీరు లభించేది. ప్రస్తుతం ప్రైవేట్‌లో ఎక్కువ ధరకు కొనలేక పోతున్నాం. రూ. 5 కాకుండా రూ.10 తీసుకుని క్యాన్ నీటిని అందించాలి. అధికారులు స్పందించాలి.

- కేశోజు విజయలక్ష్మి, గ్రామస్తురాలు

మూసివేయడం సరికాదు..



గ్రామంలోని జీపీ వాటర్ ప్లాంట్ పనిచేయకపోడానికి సిబ్బంది, కార్యదర్శి నిర్లక్ష్యమే కారణం. గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్నా రిపేర్ల పేరుతో నిధులను వృథా చేయడమే కాకుండా మూసి వేయడం సరికాదు.

- సాదం రమేశ్, గ్రామస్తుడు

పట్టించుకుంటే బాగుంటుంది



చెరువుకు సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను పట్టించుకుంటే బాగుంటుంది. ఇది సిబ్బంది నిర్లక్ష్యమే. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఎప్పుడూ మూసివేయలేదు. ప్రజల ఇబ్బందిని దృష్టిలోపెట్టుకుని వినియోగంలోకి తేవాలి.

- ఎర్రబెల్లి చేరాలు, మాజీ సర్పంచ్

'మహాసభలను జయప్రదం చేయండి'


మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జనగామ రూరల్: ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు ఐదు రోజులపాటు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో నిర్వహించనున్న సీపీఎం 24వ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యదర్శి కనుకారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడారు. ప్రజల పక్షాన నిర్వహించబోయే పోరాటాలకు రూపకల్పన చేసేందుకు మహాసభలు వేదిక కాబోతున్నాయన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, అహల్య, సాంబరాజు యాదగిరి, సింగారం రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద, గోపి జోగుప్రకాశ్, సుంచు విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కుమార్ చేరిక

జనగామ: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన టీడీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో నాయకుడు జేరిపోతుల కుమార్ టీడీపీ పార్టీలో బుధవారం చేరారు. ఆయనకు పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, సెంట్రల్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కుందారం కృష్ణచారి, జనగామ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ రామిని హరీశ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఇందుకు సహకరించిన పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి తళ్లపల్లి ఎల్లేష్, జాతీయ, రాష్ట్ర, జిల్లా, మైనార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


టీడీపీలో చేరుతున్న జేరిపోతుల కుమార్

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, స్వయం పాలనకు కత్తి పట్టి యుద్ధం చేసిన వీరోచిత పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి ర్యాలీలు తీశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, ఆరె సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్


దేవరుప్పల: సీతారాంపురంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆరె సంఘం ప్రతినిధులు


జనగామ రూరల్: నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్


బచ్చన్నపేట: ర్యాలీ తీస్తున్న యువకులు


స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లులో..


నర్మెటలో..


రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో..

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అగు **చిన్నం వెంకటేష్, తండ్రి: నరసింహులు,** నివాసం: కూర్మవాడ, జనగామ జిల్లా గారు తేది: 16-2-2025 నాడు జనగామ బస్‌స్టాండ్ నుండి ఆటోలో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యములో రిజిస్టర్ దస్తావేజు నెం.1097/2022 కు సంబంధించిన ఒరిజినల్ లింకు రిజిస్టర్ దస్తావేజు నెం. 1733/2001, తేది: 16-8-2001 ను పోగొట్టుకున్నారు. సదరు ఒరిజినల్ లింకు రిజిస్టర్ దస్తావేజు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాలో ఇవ్వగలరు. ఇట్టి ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజుతో ఎవరైన ఎలాంటి లావాదేవీలు జరిపిన, నా క్లయింటు చట్టరీత్యా తీసుకునే చర్యలకు బాధ్యులగుదురు.

సం/- **S. MURALIDHAR**
Advocate
H.No.2-7-484/3, Excise Colony, Subedari, Hanumakonda. Cell: 9849710502.